## క్లుప్తంగా

### పేదలకు అన్నసమారాధన



గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యాక్రమాల్లో భాగంగా మంగళవారం పేదలకు అన్నసమారాధన జరిగినట్లు సేవా సంస్థ పట్టణ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. స్థానిక సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ సలహా మండలి సభ్యురాలు నందమూరి పద్మజ సహకారంతో ఈ అన్నసమారాధన జరిపినట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధికి సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ పీవీ శేషగిరిరావు, వైస్ చైర్మన్ వేణుగోపాలరావు, ఎ.గోపిరెడ్డి, దండమూడి సీతారామస్వామి, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### యాచకులకు భోజన వసతి



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మందపాడులోని యాచక నివాస కేంద్రంలో మంగళవారం భోజన వసతి కల్పించినట్లు క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల శివ రామకృష్ణ తెలిపారు. విశ్రాంత డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంజీవీ ఆంజనేయులు వితరణతో ఈ కార్యక్రమం జరిపినట్లు ఆయన వివరించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో సంచరిస్తూ యాచించే యాచకుల సంక్షేమానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో తమ వంతు సహకారంగా మంగళవారం భోజనవసతి కల్పించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి కె. రామకృష్ణ, ఎం. రామకృష్ణ, పి. సత్యనారాయణ, డి. శ్రీనివాసరావు, సీహెచ్. రామకృష్ణ, బొగ్గారపు తిరుపతయ్య, కొనకళ్ల సీతయ్య పాల్గొన్నారు.

### సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు జరిగాయి. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి పుట్టలో పాలుపోసి అభిషేకాలు చేయించుకుని దర్శించుకున్నారు. పొలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో నిత్యాన్నదాన ప్రసాదానికి తగిన ఏర్పాట్లను సహాయ కమిషనర్ నేల సంధ్య పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అదనపు కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు అన్నప్రసాద పరిమాణాన్ని పెంచేలా చర్యలు తీసుకున్నారు. ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి అభిషేకాలు జరిగాయి.

### విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

మొవ్వ: పాఠశాలలు ఈ నెల 12వ తేదీ నుంచి పునఃప్రారంభమవుతున్న తరుణంలో వంట ఏజెన్సీల నిర్వాహకులకు మండల విద్యాశాఖ అధికారి-2 కే శ్రీలక్ష్మి పలు సూచనలు ఇచ్చారు. స్థానిక శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధాన మంత్రి పోషణ అభియాన్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

### ఎన్టీఆర్‌కు ఘన నివాళి

గుడివాడ టౌన్: ప్రముఖ సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు చుండూరి శేఖర్, తోట రాజేష్, బోయిన శేఖర్, చుండి బాబి, పి. కృష్ణ, కాకొల్లు ప్రసాదు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను పామర్రులో మంగళవారం నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాసు నివాళులర్పించారు. నాయకులు వీ గణేష్, కె.ప్రవీణ్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తోట్లవల్లూరు: ఓ వివాహిత అదృశ్యంపై తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు తోట్లవల్లూరు గ్రామానికి చెందిన అబ్దుల్ నీలోఫర్ తన 14 నెలల కుమారుడు అబ్దుల్ నజీర్‌తో కలిసి ఈ నెల 23 తెల్లవారుజామున ఇంటి నుంచి అదృశ్యమైనట్లు ఆమె భర్త అబ్దుల్ జిలానీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.విశ్వనాథ్ మంగళవారం రాత్రి తెలిపారు.

# వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు

- సస్యరక్షణ చర్యలతో క్రిమికీటకాలు దూరం
- భూసార పరీక్షలు తప్పనిసరి



పంట పొలాల్లో ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు



దున్నిన పంట పొలం

గుడివాడరూరల్: రబీసాగులో మినపతీత అనంతరం మళ్లీ వర్షాలు కురిసేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారతాయి. అందువల్ల వేసవి దుక్కులు కచ్చితంగా దున్నాలి. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయశాఖ అగ్రికల్చరల్ అసిస్టెంట్లను సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

**ప్రయోజనాలు ఇలా..**

వేసవిలో పొలాల్లో పంటలు సాగులో ఉండవు. చీడ, పీడ, పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమిని ఆశ్రయిస్తాయి. వరి, అపరాలు వంటి పంటలకు ఆశించే తెగుళ్లు, పచ్చ పురుగు, లద్దె పురుగు వంటివి భూమిలో ఉంటాయి. వేసవిలో లోతుగా దుక్కులు దున్నటం వలన నేలలో ఉన్న చీడ పురుగుల కోశాలు, గుడ్లు బయటపడి వేడికి చనిపోతాయి. కొంగలు, కాకులు తదితర పక్షులు వాటిని తిని నాశనం చేస్తాయి. సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్లో భాగంగా వేసవిలో లోతుగా దుక్కులను దున్నటంతో పురుగు మందుల వ్యయం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటలు కోసిన తర్వాత తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోకి ఇంకుతుంది. ఈ దుక్కుల వల్ల ఇతర గడ్డి జాతి మొక్క విత్తనాలు వేసవి ఉష్ణోగ్రతలకు గురై మొలిచే శక్తిని కోల్పోతాయి. వేసవి దుక్కులు చేపట్టేందుకు మే నెల అనువైన సమయం. దీంతో రైతులు ముమ్మరంగా దుక్కుల పనులు చేపట్టారు. దీని వల్ల భూమిలో అడుగు భాగాన ఉన్న గడ్డి మూలాలు వర్షం పడగానే పెరిగిన పంటలను దెబ్బ తీస్తాయి. వీటిని నివారించేందుకు వేసవిలో పొలాల్లో ఒకటిన్నర అడుగు లోతు వరకు రెండు మడకలతో వేసవి దుక్కులు చేపట్టాలి. దీనివల్ల భూమి లోపల ఉన్న శిలీంధ్ర సిద్ధ బీజాలతో పాటు, గడ్డి మూలాలు కూడా బయటపడి అధిక ఉష్ణోగ్రతకు నశించిపోతాయి. వేసవి దుక్కులు చేపట్టడం వల్ల భూమి వదులుగా మారి వర్షం పడినప్పుడు గాలి, నీరు, ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తేందుకు అనుకూలంగా ఉంటుంది. దుక్కుల అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువు పొలంలో చల్లుకోవాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయి.

**భూసారం పెరుగుతుంది**

వేసవి దుక్కులు వల్ల భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు బయటపడి కీటకాలు నశిస్తాయి. దీని వల్ల పురుగుల మందుల వాడకం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటల కోత తరువాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం రైతు భరోసా కేంద్రాల్లోనే అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలి. భూసార పరీక్షల వల్ల ఎరువుల వాడకం తగిన రీతిలో పంటలకు వేసుకోవచ్చు.

–బి. అనంతలక్ష్మి,
మండల వ్యవసాయశాఖ అధికారి

# శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కిషోర్‌బాబు

పమిడిముక్కల: ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్ బాబు కోరారు. వీరంకిలాకు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ సందర్భంగా మండలంలో ఏ విధమైన సంఘటనలు జరగలేదని, పమిడిముక్కల ప్రశాంత మండలంగా పేరు పొందిందన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడే రోజున విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం చేయకూడదన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. ఎన్నికల ఫలితాల దృష్ట్యా ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని, కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తులను, పార్టీలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు, పోస్టులు గానీ పెట్టకూడదన్నారు. ఎన్నికల నియమావళిని అందరూ తప్పకుండా పాటించాలని, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 144 అమల్లో ఉన్నాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మధ్యాహ్న భోజనం రుచికరంగా తయారు చేయాలి



తోట్లవల్లూరులో ఆహార పదార్థాలను ప్రదర్శిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



మహిళకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీవైఈఓ పద్మారాణి

తోట్లవల్లూరు: మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచికరంగా తయారు చేయాలని గుడివాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఐ.పద్మారాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. మధ్యాహ్న భోజనం తయారు చేసే సమయంలో నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పద్మారాణి తెలియజేశారు. ఆహార పదార్థాలు తయారు చేసేటప్పుడు పరిశుభ్రతను పాటించాలన్నారు. కూరలు, పప్పు, సాంబారు, చక్కెర పొంగలి అంటే విద్యార్థులు ఇష్టంగా తింటారన్నారు. వాటిని రుచికరంగా తయారు చేయాలని సూచించారు. ఆహార పదార్థాలు రుచికరంగా తయారు చేసిన వారికి ప్రశంసాపత్రాలను పద్మారాణి అందజేశారు. ఎంఈఓ జి. వెంకటేశ్వరరావు, ఎంఈఓ-2 సురేష్, పాఠశాల హెచ్ఎం విజయశ్రీ పాల్గొన్నారు.

# భూసార పరీక్ష.. పంటకు రక్ష



పామర్రులో మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పామర్రు: భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించేలా అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. నియోజకవర్గంలో 1,200 మట్టి నమూనాలను లక్ష్యంగా నిర్ణయించి, ఆయా రైతులకు తెలియజేయనున్నారు. భూమిలో చౌడు, ఆమ్ల గుణాల స్థాయిని నిర్ధారించి, సంబంధిత భూముల్లో సాగు చేయబోయే పంటలకు ఏయే ఎరువులు వినియోగించాలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు తెలియజేస్తారు. తద్వారా భూసారాన్ని పెంచవచ్చు. నేలలో ఉండే సూక్ష్మ, స్థూల పోషకాల లభ్యతను తెలుసుకునేందుకు మట్టి నమూనా పరీక్షలను నిర్వహించాలని మచిలీపట్నం జిల్లా ట్రెనింగ్ సెంటర్ అధికారులు తెలిపారు. మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలి, నమూనాల ప్రాముఖ్యతల గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత రైతులకు ఎంతైనా ఉంది. నమూనాల పరీక్షలను ఏ విధంగా చేయాలని అనే అంశాలను అధికారులు వివరిస్తారు. పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులు ఎంత మేరకు ఎరువులు వినియోగించవచ్చు అనేది తెలుస్తుంది. మట్టి నమూనాలను రైతులు పొలాల్లో రాండమ్‌గా 10–15 ప్రదేశాల్లో నమూనాలను సేకరించాలి. ఒక్కొక్క ప్రదేశం నుంచి అరకేజీ చొప్పున మట్టిని సేకరించాలని, దీనిని బాపట్లలోని ఆర్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపి వచ్చిన ఫలితాలను రైతులకు తెలియజేస్తారు. ఈ ఫలితాల ఆధారంగా వరి సాగులో ఏయే ఎరువులు పురుగుమందులు వాడాలో తెలియజేస్తారు. వరి పొలాల్లో 15 సెంటీమీటర్ల లోతులో 'వీ' ఆకారంలో గొయ్యి తీసి మట్టి నమూనా సేకరించాలని అధికారులు తెలిపారు.

**ప్రణాళికాబద్ధంగా ఖరీఫ్**

ఖరీఫ్ సాగును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భూ సార పరీక్షలతో పాటు, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు పరీక్షలకు శాంపిల్స్ సేకరణను త్వరలో చేపడతాం. ఖరీఫ్‌కు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయి. రబీ మాసూళ్లు పూర్తయిన వెంటనే ప్రణాళికాబద్ధంగా ఖరీఫ్ సాగుకు వెళతాం.

– శివనాగరాణి,
మండల వ్యవసాయాధికారి, పామర్రు

# వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఉద్యోగి వెంకటేశ్వరరావు



జమీగొల్వేపల్లిలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



మండవల్లి గ్రంథాలయంలో బొమ్మలను తయారు చేస్తున్న విద్యార్థులు



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పమిడిముక్కల: వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పమిడిముక్కల గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. శకుని ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. వేమన పద్యాలు చదివించి పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకులు సాలార్ షరీఫ్ పాల్గొన్నారు.

**జమీగొల్వేపల్లిలో..**

జమీగొల్వేపల్లి(పామర్రు): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని గ్రంథాలయాధికారి వి.నాగసురేష్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్రలు, విద్యకు సంబంధించిన గ్రంథాలు, పంచతంత్ర-నీతి కథలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, బాల సాహిత్యాలు, రామాయణ, మహాభారత, ఇతిహాసాలు, ఆయుర్వేద గ్రంథాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. అధికారి మాట్లాడుతూ ఇటువంటి పుస్తక ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు పాఠకులకు గ్రంథాలయంలోని పుస్తకాలతో పరిచయం ఏర్పడుతుందన్నారు. దీని ద్వారా పుస్తకంపై మక్కువ పెరిగి చదవాలనే ఆసక్తి, ఆకాంక్ష పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి, యోగా గురువు పొట్లూరి వెంకటధర్మారావు, ఉపాధ్యాయుడు దీవి వంశీ కృష్ణ పాల్గొన్నారు.

**మండవల్లిలో..**

మండవల్లి: మండవల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం సృజనాత్మకమైన ఆలోచనలతో విద్యార్థులు తమకు నచ్చిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగంలో మంగళవారం బొమ్మలను తయారు చేశారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పిల్లలతో కథల పుస్తకాలు చదివించి వాటి సారాంశాన్ని వివరించారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జిపై అవగాహన కలిగించారు. జూన్ 7వ తేదీ వరకు విజ్ఞాన శిబిరాలు కొనసాగుతాయన్నారు.

**ముదినేపల్లిలో..**

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో పలు రకాల నీతి కథల పుస్తకాలను మంగళవారం పఠనం చేయించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఎంపిక చేసిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.

# హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



హనుమాన్‌చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

మచిలీపట్నంటౌన్: హనుమజ్జయంతి ఉత్సవాలు నగరంలోని పలు ఆలయాల వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. నగరంలోని ఆంజనేయస్వామి దేవస్థానాల్లో మంగళవారం నుంచి జూన్ 1వ తేదీ శనివారం వరకు ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించనున్నారు. నగరంలోని బచ్చుపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఉదయం సింధూరార్చన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. కవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ హనుమత్‌తత్వం అనే అంశంపై ప్రసంగించారు. టీటీడీ ధర్మ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో గరుడ సేవా సమితి సభ్యులు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమాలను టీటీడీ ప్రతినిధి తురగా ప్రసాద్ పర్యవేక్షించారు. 29, 30, 31 తేదీల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

### పాము కాటుకు యువకుడి మృతి



మృతుడు వంశీ సూర్య మణికంఠ

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడి గ్రామానికి చెందిన ఓ యువకుడు పాము కాటుకి గురై మృతి చెందాడు. పెదపూడి గ్రామంలోని కమ్యూనిస్టు బజారులో నివాసం ఉండే నాదెళ్ల ప్రకాశరావు, శివ పార్వతీలకు నాదెళ్ల వంశీ సూర్య మణికంఠ, మరో ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వంశీ సూర్య మణికంఠ(24) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వర్క్ ఫర్మ్ హోమ్ కావటంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. సోమవారం రాత్రి పని పూర్తి చేసుకుని నిద్రలో ఉండగా పాము కాటుకు గురయ్యాడు. ఉదయాన్నే కుటుంబ సభ్యులు చూసే సమయానికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. మంగళవారం వేకువ జామున మొవ్వ ప్రభుత్వాస్పత్రికి అతడ్ని తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. చేతికందిన కొడుకు విఘత జీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

# విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

గూడూరు: కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవులను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం యోగాసనాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. గూడూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన శిక్షణా తరగతులకు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగాసనాల వల్ల విద్యార్థులలో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం వల్ల చదువులలో మరింత రాణిస్తారన్నారు.

### విద్యార్థులకు పోషకాహారం అందించాలి

కైకలూరు: మధ్యాహ్న భోజన పథకంలో ప్రతి విద్యార్థికీ పోషకాహారం అందించాలని ఎంఈఓ వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల వంట తయారీ ప్రధాన నిర్వాహకులకు అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు ఆకు కూరలు, విటమిన్-సి లభించే పండ్లు, జామ, నిమ్మ, ఉసిరి ప్రతిరోజూ తినే ఆహారంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం అన్నపూర్ణ, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది సూరిబాబు ఝాన్సీ, సీఆర్పీలు ఆశయ, సుధాకర్, మంగారావు, సుగుణ పాల్గొన్నారు.



# అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ సమకూర్చిన వస్తు సామగ్రి కిట్లను మంగళవారం అందజేశారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న మోపిదేవి సబ్ బ్రాంచ్ ప్రతినిధులు వస్తు సామగ్రి, కూరగాయలు, టార్పాలిన్ పట్టా, బియ్యం బాధిత కుటుంబాలకు అందించారు. అధ్యక్షుడు యర్రంశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ కందుల సీతారామయ్య, సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు, వీఆర్వోలు బీ నీల్‌కాంత్, జీవీ రమణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు శ్రీలక్ష్మీ వసుంధర భరతనాట్యం అరంగేట్రం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పురాతన దేవాలయాల్లో శిల్పాలు భరత నాట్య భంగిమలలో అప్సరసలు నాట్యం చేస్తున్నట్లుగా తీర్చిదిద్దబడి ఉండటం అందరికి తెలిసిందే. అటువంటి అద్భుత భరత నాట్యంలో గన్నవరానికి చెందిన చిన్నారి శ్రీలక్ష్మీ వసుంధర వల్లభనేని బుధవారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తన భరత నాట్య ప్రదర్శనతో అరంగేట్రం చేస్తోంది. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ-డాక్టర్ పంకజశ్రీ తనయ శ్రీలక్ష్మీ వసుంధర. తల్లి డాక్టర్ పంకజశ్రీ ప్రోత్సాహంతో ఈ చిన్నారి తన 6వ ఏట నుంచే శ్రీనృత్య ఆర్ట్ అకాడమీకి చెందిన ప్రముఖ నాట్యాచారిణి డాక్టర్ భాగవతుల సౌమ్య వద్ద శిక్షణ తీసుకుంది. ఈ అరంగేట్రంలో భరతనాట్యంలోని పలు అంశాలకు శ్రీలక్ష్మీ వసుంధర నర్తించనుంది.

### మీసాల వెంకన్నకు లక్ష మల్లెల పూజ



కైకలూరు: మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కైకలూరు భూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి లక్ష మల్లెల పూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీమన్నారాయణ గోష్టి చిట్టి హేమలత బృందం ఆధ్వర్యంలో లక్ష మల్లెల పూజా కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

### కిశోర బాలికల సమావేశం

మండవల్లి: మాసిక మహోత్సవంలో భాగంగా మండవల్లిలో కిశోర బాలికల సమావేశం మంగళవారం నిర్వహించారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, పిరియడ్స్ సమయంలో తీసుకోవాల్సిన వ్యక్తిగత శుభ్రత, గుడ్ టాక్, బ్యాడ్ టాక్ గురించి సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి వివరించారు. కిశోర బాలికలతో చైతన్య ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సరస్వతి, సుధారాణి, ఉమాదేవి, శ్రీదేవి, నాగలక్ష్మి, జయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### ఉపాధి హామీతో రైతులకు అధిక దిగుబడులు

మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు అధిక దిగుబడులు కలిగే అవకాశం కలుగుతుందని ఎంపీడీఏ ఎన్ నవీన్ అన్నారు. మండలంలోని అల్లినగరంలో రూ.68 వేల ఉపాధి నిధుల వ్యయంతో 64 మంది కూలీలతో పంట బోదె పనులను మంగళవారం నిర్వహించారు. కాలువలకు మరమ్మతులు చేపట్టడం ద్వారా పంట బోదెలకు నీరు చేరి, పొలాలకు సమృద్ధిగా సాగు నీరు అందడంతో అధిక దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని తెలిపారు. పనుల వల్ల కూలీలకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా వెసులుబాటు కలుగుతుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.